క్లుప్తంగా

కొత్తపేట శివాలయంలో అన్నదానం



పట్నంబజారు: గుంటూరు కొత్తపేటలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరీ సమేత ఉమా మహేశ్వరస్వామి దేవస్థానం (కొత్తపేట శివాలయం)లో స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మొగిలి సతీష్, కమిటీ సభ్యులు యడ్లవల్లి విజయలక్ష్మి, ఇర్ల వాణి తదితరులు పాల్గొన్నారు.

శారదా కాలనీ బీఫామ్స్‌ను రిజిస్ట్రేషన్ చేయండి

ఆర్డీఓకు వినతి



గుంటూరు వెస్ట్: తూర్పు నియోజకవర్గ పరిదిలోని శారదా కాలనీ 50వ వార్డు ప్రాంతంలో ఎన్నో దశాబ్దాలుగా బి.ఫామ్ పట్టాలతో చిన్న చిన్న ఇల్లు కట్టుకుని నివిస్తున్నారని, వారి పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించాలని డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా, ఆర్డీఓ పి.శ్రీకర్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వారిరువురు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లు చేయిస్తే ప్రభుత్వానికి ఆదాయంతోపాటు లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు లభిస్తాయన్నారు. బ్యాంకులు కూడా రుణాలు ఇస్తాయన్నారు. క్రయ విక్రయాలతో నగదు సర్క్యులేషన్ జరుగుతుందని చెప్పారు. దీనిపై సీరియస్‌గా ఆలోచించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజా మహోత్సవాలు

పాత గుంటూరు: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం మండల పూజా మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అష్టద్రవ్య మహాగణపతి హోమం, నవకలశాభిషేకం నిర్వహించారు. ప్రాంగణంలోని రామలింగేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అన్నాభిషేకం, చండీ, నవగ్రహ హోమం, మహా పూర్ణాహుతి వేదమంత్రాల నడుమ విశేషంగా జరిగింది. మాల ధరించిన స్వాములకు, అయ్యప్ప భక్తులకు మండల కాలంగా నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ ముగింపుగా మహానైవేద్యం, అనంతరం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. జె.రాము గురుస్వామి ఆధ్వర్యంలో పదునెట్టాంపడి పూజలు స్వామి శరణు ఘోషతో కోలాహలంగా నిర్వహించారు. శ్రీను స్వామి అయ్యప్ప భజనతో స్వాములు పరవశించారు. భిక్షా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు



గుంటూరు ఈస్ట్: ఆక్రమణలో ఉన్న దేవదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన స్థలాన్ని ఆ శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే నగరంలోని అరండల్‌పేట 12/1లోని శ్రీరమాసత్యనారాయణ స్వామి దేవస్థానానికి చెందిన సుమారు రూ.3 కోట్లు విలువ చేసే 250 చదరపు గజాల స్థలం అన్యాక్రాంతంలో ఉంది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.మహేశ్వరరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆలయ అధికారి జి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు జె.సాయి విశ్వనాథ్, నాగలక్ష్మి, విజయభాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డిలు రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్ర’

- రెండోరోజు హోరాహోరీగా పోటీలు
- నగర కమిషనర్ కీర్తి చేకూరి



బీఆర్ స్టేడియంలో జరిగిన పోటీలకు హాజరైన క్రీడాకారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు వార్డు సచివాలయాల వారీగా గుర్తించిన క్రీడా మైదానాల్లో ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో భాగంగా నగరంలో వార్డు సచివాలయాల వారిగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. క్రీడా పోటీలకు అవసరమైన కిట్స్ కూడా అందించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు తమ టీం కి మ్యాప్ చేసిన మైదానానికి కేటాయించిన సమయానికి రావాలన్నారు. నోడల్ అధికారులు పోటీల నిర్వహణ, ఫలితాల వెల్లడిపై ఎప్పటికప్పుడు శాప్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అడ్మిన్ కార్యదర్శులు సచివాలయంలో రిజిస్టర్ చేసుకున్న టీంలు నిర్దేశిత సమయానికి వచ్చేలా పర్యవేక్షణ చేసుకోవాలన్నారు. ఎవరైనా మైదానాల వద్ద అప్పటికప్పుడు తాము కూడా ఆడతాము అంటే వారికి కూడా స్పాట్ రిజిస్టర్ చేయాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య అధికారులు క్రీడా మైదానాల వద్ద శానిటేషన్ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడలను చూడడానికి వచ్చే ప్రేక్షకులకు కూడా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లతో నగరంలో జరిగే ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణలో ఏ సమస్య లేకుండా సమన్వయం చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు.

ఏడుగురికి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు

ధ్రువపత్రాలు అందజేసిన జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏడుగురు ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. బుధవారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐదుగురు టైపిస్టులతో పాటు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగాను, గ్రేడ్ - 1 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న అమరేష్‌కు పరిపాలన అధికారిగా ఉద్యోగోన్నతి కల్పించారు. వీరితో పాటు కారుణ్య నియామకం కింద ఒకరికి ఆఫీసు సబార్డినేట్‌గా నియామక ఉత్తర్వులు అందించారు. సీనియర్ అసిస్టెంట్లుగా వీజీవీ రమణ (బొల్లాపల్లి), ఆర్.వేంకటేశ్వరరావు (అచ్చంపేట), ఆర్.అంజిబాబు (రెంటచింతల), రవికుమార్ (ఈపూరు), బి.విజయ్‌కుమార్ (కారంపూడి), ఆర్.భారతి (వినుకొండ), ఏడుకొండలు (శావల్యాపురం) మండ పరిషత్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందారు. మంగళగిరి మండలంలో గ్రేడ్ - 1 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న జి.అమరేష్‌కు ఏపీఐఐసీ కార్యాలయంలో పరిపాలనాధికారిగా ఉద్యోగోన్నతిపై నియమించారు. బక్కా అనూషకు యడ్లపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం కల్పించారు. నరసరావుపేట, మాచవరం, పొన్నూరు, దుర్గి జెడ్పీటీసీలతో పాటు జెడ్పీ ఏ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న అల్లాభక్షు

గుంటూరు మెడికల్: గుంటూరు కోవిడ్ ఫైటర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలు ఇరువురికి జీవనోపాధి కోసం కుట్టు మిషన్‌లు బుధవారం అందజేశారు. కుట్టుమిషన్లు సహాయం చేసిన ఇమేజ్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ముస్తఫాకు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పఠాన్ అల్లాభక్షు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్లపై అనాథలుగా వదిలి వెళ్లిన వారిని ఆశ్రమాల్లో చేర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఉచితంగా అంబులెన్సు ఏర్పాటు చేశామన్నారు. అంత్యక్రియలు చేసుకోలేని వారికి సొంత వాహనంలో తీసుకెళ్లి వారి మతాచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద రోగులకు ట్రస్టు ఆధ్వర్యంలో నిధులు సేకరించి ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. జీజీహెచ్‌లో ప్రతిరోజూ రోగుల సహాయకుల కోసం ఉచితంగా భోజనం పెడుతున్నామన్నారు. ట్రస్టు సేవలు వినియోగించుకోవాలనుకునేవారు 8143222456, 9397602553 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అల్లాభక్షు కోరారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు నాలుగు రోజుల గడువు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించడానికి నాలుగు రోజులు (28,29,30,31 తేదీలు) మాత్రమే గడువు ఉందని, పన్ను చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు. 2023–24 రెండో అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు ఈ నెలాఖరు వరకే గడువు ఉందని, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు అదనంగా నగరంలోని భారత్ పేట 140 సచివాలయం, వసంతరాయపురం 148 సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్ లోని 106 సచివాలయాల్లో కూడా పన్ను చెల్లించడానికి ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. డిసెంబర్ 31 ఆదివారం చివరి రోజు కనుక సెలవు రోజు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయన్నారు. నగర పాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

- నగరపాలక సంస్థ సచివాలయ కార్యదర్శులు పన్ను బకాయిదార్లకు ప్రత్యేక స్లిప్ లను అందించాలని, ఫోన్ల ద్వారా ప్రత్యేక కౌంటర్లు, క్యాష్ కౌంటర్ల సమయం గూర్చి సమాచారం ఇవ్వాలన్నారు. 31 తర్వాత బకాయిదార్లకు నీటి కుళాయిలు, అత్యవసర సేవల నిలుపుదల నోటీసులు, ఆర్.ఆర్.యాక్ట్ ద్వారా బకాయిల వసూళ్లకు నోటీసులు సిద్ధం చేయాలన్నారు. పన్ను వసూళ్లు 50 శాతం వసూళ్లు చేయని అడ్మిన్ కార్యదర్శులు, ఆర్ఐ, ఆర్ఓలను టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తామన్నారు.

చలపతి విద్యార్థుల రక్తదానం



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్, చలపతి కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో నిత్యం ఆపరేషన్లు చేస్తుంటారని, వారందరికీ రక్తం ఎంతో అవసరమని అలాంటి వారి కోసం విద్యార్థులు ముందుకు వచ్చి రక్తం దానం చేయడం అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం లాం సమీపంలోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మేజర్ ఆపరేషన్లు జరుగుతున్నాయని, వారికి రక్తం అవసరం ఏర్పడుతోందన్నారు. కిడ్నీ, గుండె ఆపరేషన్ల కోసం ఆరు యూనిట్ల రక్తం అవసరం ఏర్పడుతోందని వెల్లడించారు. ప్రతి పేదవాడికి ఆపరేషన్ సమయంలో రక్తం సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్య సంస్థలు ముందుకు వచ్చి రక్తం దానం చేయడం అభినందనీయమన్నారు. కాన్పుల విషయంలో కూడా తల్లులు రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలంటి వారి కోసం విద్యార్థులు ముందుకు వచ్చి రక్తం దానం చేయడం శుభ పరిణామమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు విద్యార్థులకు డాక్టర్ కిరణ్ కుమార్ ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం కళాశాల సిబ్బంది డాక్టర్ కిరణ్ కుమార్‌కు శాలువా కప్పి సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, డాక్టర్ రామారావు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు రజనీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



గుంటూరు మెడికల్: ప్రముఖ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి స్థానిక ఏటీ అగ్రహారం శ్రీ విజేత హైస్కూల్లో పీరియడ్స్ పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు పీరియడ్స్ టైంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. రుతుస్రావంపై పాఠశాల వయస్సులో పిల్లలకు సరైన అవగాహన లేక చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అవగాహన సదస్సు వల్ల కౌమార దశ బాలికలకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కలుగుతుందన్నారు. ప్రతి మహిళ పరిశుభ్రత పాటించాలన్న డబ్ల్యూహెచ్ఓ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుతుస్రావ సమయం అనేది ఒక న్యాచురల్ ప్రాసెస్ అని దీనివలన ఎటువంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. బాలికలకు ఈ విషయంపై స్కూలు వయస్సులోనే అవగాహన కల్పిస్తే వారికి సమస్యలు వచ్చినప్పుడల్లా ఎలా స్పందించాలో తెలుస్తుందన్నారు. శ్రీ విజేత హైస్కూల్ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చుట్టుగుంట సెంటర్‌లో ఈనెల 18వ తేదీన సుమారు 55 సంవత్సరాల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన స్థానికులు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 8688831336 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



కొమ్మూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ సూచించారు. మండలంలోని కొమ్మూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. గ్రామంలో బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించి వారి తల్లి దండ్రులతో చర్చించి ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలని ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల పనితీరు,విద్యార్థుల హాజరు,మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం మెరిగల శ్యామ్‌కుమారి ఉన్నారు.

ఓబీసీ రిజర్వేషన్లు వ్యతిరేకించడం సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

నెహ్రూనగర్: ఓబీసీల స్థితిగతులు మెరుగుపడాలంటే కుల జనగణనే పరిష్కార మార్గమని, 2010లో లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీ హోదాలో బీజేపీ అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని వాగ్దానం చేసి ప్రస్తుతం తెరవెనక ఆర్ఎస్ఎస్, బీజేపీ మండల్ పేరుతో ఓబీసీ రిజర్వేషన్లు వ్యతిరేకించడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం చుట్టుగుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతలు తొలగిపోవాలంటే కుల గణన ఒకటే పరిష్కార మార్గమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో బీజేపీ అగ్ర నాయకులు ఓబీసీ రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ ఉత్తర భారత దేశంలో పాదయాత్ర చేపట్టడం బాధాకరమన్నారు. 2024 ఫిబ్రవరిలో జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనైనా ఓబీసీ జనాభా కుల గణన చేయాలని లేనిపక్షంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్తామన్నారు. సంఘ నాయకులు కుమ్మర క్రాంతి కుమార్, పారేపల్లి మహేష్, కొల్లూరి హనుమంతరావు, కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మినిస్టీరియల్ స్టాఫ్ బాధ్యతాయుతంగా పని చేయాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో పనిచేసే ప్రతి మినిస్టీరియల్ స్టాఫ్ బాధ్యతాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సూచించారు. బుధవారం శుశ్రుత హాలులో మినిస్టీరియల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కొంతమంది ఉద్యోగులు పనిభారంగా మారుతుందని, మార్పులు, చేర్పులు చేయాలని కోరుతున్నారని వారి సమస్యలను త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.

- ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీం (ఈ హెచ్ ఎస్) పరిధిలో వైద్యం కోసం వచ్చే ప్రభుత్వ ఉద్యోగులకు వీఐపీ చికిత్స అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈహెచ్ఎస్ కింద ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ప్రజల్లో మంచిపేరు తీసుకుని వచ్చేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ పాల్ సుధాకర్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



కొప్పర్రులో మిర్చి పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి రాజకుమారి

పెదనందిపాడు: ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహార పదార్థాలను తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు అని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి రాజకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొప్పర్రులో ప్రకృతి వ్యవసాయ పంటలను బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మిరప 341 రకం పంట పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని చెప్పారు. రైతులు పండించిన పంటలను ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి రసాయన అవశేషాలు 0.0 శాతం ఉంటే వాటికి మార్కెట్ రేటుపై 15 శాతం అదనపు ధరతో కొనుగోలు చేస్తారని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంలో కషాయాలు, ద్రవజీవామృతాలు లాంటివి మాత్రమే పిచికారి చేసి పండించాలని రైతులకు సూచించారు. గోకమ్స్ కంపెనీ మేనేజర్ హిదాయుతుల్లా మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన పంటను గత సంవత్సరంలో కొనుగోలు చేశామని, ఈ సంవత్సరం కూడా ఎక్కువ మొత్తంలో సేకరించనున్నట్లు చెప్పారు. రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు రూనీ, సుమ, ఎంటీలు వరప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు

పెదకాకాని: గంగాభ్రమరాంబ సమేత చంద్రశేఖరస్వామివారి 81వ ఆర్ద్రా మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో ఐదు రోజుల పాటు వైభవంగా నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలిరోజు వేకువజామున శుభోదయం, ప్రభాతసేవ, విఘ్నేశ్వర పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. స్వామివారికి మహాన్యాస పూర్వక అర్ద్రాభిషేకం, ఉత్తర ద్వారా దర్శనం, పంచాక్షరి అఖండ నామ యజ్ఞ ప్రారంభించారు. అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు, నామ సంకీర్తనలు జరిపించారు. రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమా నిర్వహించారు. గురువారం సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల డాక్టర్ గరికపాటి నరసింహారావు శివ తత్వం అనే అంశంపై ప్రవచనం చేస్తార ని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

సంతానలేమి సమస్యలకు ఉచిత వైద్యశిబిరం

- జనవరి 15వరకు ఉచితంగా వైద్య పరీక్షలు
- ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల నేడు చాలా మంది అమ్మతనానికి దూరమవుతున్నారని, ప్రతి ఏడాది సంతానలేమి సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతుందని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణుడు, అహల్య ఐవీఎఫ్ సెంటర్ అధినేత డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ చెప్పారు. స్థానిక కొత్తపేటలోని అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సకాలంలో పిల్లలు పుట్టకపోవటంతో దంపతుల్లో తీవ్రమైన మానసిక క్షోభ పెరిగిపోయి పలు అనర్థాలకు దారితీస్తుందని వెల్లడించారు. వైద్య రంగంలో వచ్చిన ఆధునిక పద్ధతుల వల్ల సంతానం లేనివారికి పిల్లలు పుడుతున్నారని చెప్పారు. నిపుణులైన వైద్యులను సంప్రదించి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఏళ్లతరబడి పిల్లలు పుట్టని వారికి సైతం నేడు సంతానం కలుగుతుందన్నారు. పెళ్లయిన ఏడాది పాటు ఎలాంటి గర్భనిరోధక పద్ధతులు పాటించకుండా దాంపత్య జీవితాన్ని కొనసాగించినా గర్భం రాకపోవటాన్ని వంధత్వం(ఇన్‌ఫెర్టిలిటీ) అంటారన్నారు. ఆడవాళ్లలోను, మగవాళ్లలోనూ వివిధ కారణాలతో వంధత్వ సమస్య ఏర్పడు తుందన్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబరు 25 నుంచి సంతాన లేమి సమస్యతో బాధపడుతున్నవారికి తమ ఆసుపత్రిలో 2024 జనవరి 15 వరకు ఉచితంగా కన్సల్టేషన్, అల్ట్రాసౌండ్ పరీక్షలు, కౌన్సెలింగ్, ఉచిత స్పెర్మ్ పరీక్షలు చేస్తున్నామన్నారు. గుంటూరు కొత్తపేట శివాలయం వెనుక ఉన్న అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో, విజయవాడ సీతారామపురం వారణాసి వీధిలోని అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో నెలరోజులపాటు మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. సంతానం లేని దంపతులతో పాటు ప్రమాదవశాత్తు సంతానం కోల్పోయిన వారు కూడా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఉచిత వైద్య శిబిరాలకు వచ్చే వారికి 50 శాతం రాయితీతో ఐవీఎఫ్ చికిత్సలు అందిస్తున్నామని ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల రాజకుమారి తెలిపారు. పూర్తి వివరాల కోసం 9848590244, 9908836169 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా శివ ముక్కోటి వేడుకలు

చేబ్రోలు: స్థానిక నాగేశ్వర స్వామి, భీమేశ్వర స్వామి దేవస్థానాల్లో శివ ముక్కోటి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శివముక్కోటి సందర్భంగా గంగాపార్వతి సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో ఆరుద్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని మంచాల గ్రామంలోని గంగా పార్వతి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శివముక్కోటి వేడుకలు ఘనంగా జరిగాయి.

స్పర్శలేని మచ్చలను గుర్తించాలి

ఫిరంగిపురం: శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగివర్ణం కలిగిన మచ్చలు ఆరోగ్యసిబ్బంది గుర్తించాలని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యులు పి.ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎల్‌సీడీసీ(లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికి ఆరోగ్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు వెళ్లి ఇంటిలోని ప్రతి ఒక్కరి వివరాలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మందమైన మెరిసే జిడ్డు గలిగిన చర్మం ఉండటం, చెవులపై, వీపుపై బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కుదిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారుట, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శలేకపోవడం వంటి లక్షణాల ద్వారా కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించవచ్చని తెలిపారు. పై అనుమానిత లక్షణాలు ఉన్నవారిని సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వారికి పరీక్షలు చేసి మందులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమం బుధవారం నుంచి జనవరి 12 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పి.వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, హెచ్ఎస్ కొండపల్లి సుదర్శనరాజు పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా షేక్ అక్రమ్

తాడేపల్లిరూరల్: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా షేక్ అక్రమ్‌ను, నియోజకవర్గ అధ్యక్షులు షేక్ హనీఫ్‌షా ఖాదరి నియమిస్తున్నట్లు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ తీర్మానం చేశారు. బుధవారం ఈ మేరకు మంగళగిరి స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి మంగళగిరి నియోజకవర్గ కమిటీ ఏర్పాటు సమావేశంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నూతన రాష్ట్ర కార్యదర్శి షేక్ అక్రమ్‌కు, నియోజకవర్గ నూతన అధ్యక్షులు షేక్ హనీఫ్‌షా ఖాదరి నియామక పత్రాన్ని అందజేశారు.